క్లుప్తంగా

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఎంఈఓ యాదగిరి



విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న ఎంఈఓ యాదగిరి

వెల్దుర్తి(తూప్రాన్): ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం దాతలు, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎంఈఓ యాదగిరి విద్యార్థులకు సూచించారు. ఈ మేరకు మండలంలోని అందుగులపల్లి ప్రాథమిక పాఠశాలలో స్పందన స్వచ్ఛంద సంస్థ సహకారంతో రూ.50 వేలు విలువజేసే కాపీ రైటింగ్, డ్రాయింగ్, కర్సీవ్‌రైటింగ్, పర్యావరణ విజ్ఞానం పుస్తకాలను గురువారం విద్యార్థులకు అందజేశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ..స్వచ్ఛంద సంస్థ అందించిన సహకారంతో విద్యార్థులు తమ చేతిరాతను మెరుగుపరుచుకోవాలన్నారు. అదేవిధంగా సులభ పద్ధతిలో ఇంగ్లిష్ బోధనపై శ్రద్ధ వహించాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహేశ్, ఉపాధ్యాయురాలు పద్మ తదితరులు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోండి



శభాష్‌పల్లి వద్ద ప్రభుత్వ భూమిలో జరుపుతున్న మట్టి తవ్వకాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి శభాష్‌పల్లి గ్రామ శివారులో నిబంధనలకు వ్యతిరేకంగా ప్రభుత్వ భూముల్లో జరుపుతున్న మట్టి తవ్వకాలను వెంటనే ఆపాలని స్థానికులు కోరుతున్నారు. రాత్రి వేళల్లో కొందరు వ్యాపారులు జేసీబీ, ఇటాచీలతో మట్టి తవ్వకాలు జరుపుతూ టిప్పర్ల ద్వారా వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారని తహసీల్దార్ కమలాద్రికి స్థానికులు గురువారం ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో మట్టి వ్యాపారం ఇక్కడ జోరుగా సాగుతోందని ఫిర్యాదులో వివరించారు. వెంటనే ఈ అక్రమ మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, దీనికి తహసీల్దార్ స్పందిస్తూ మట్టి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతంలో క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు తీసుకుంటామని హామీ నిచ్చారు.

పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారి



బహిరన్‌దిబ్బ గ్రామంలో రైతులు సాగు చేస్తున్న పంటలను పరిశీలిస్తున్న ఏఓ

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని బహిరన్‌దిబ్బ గ్రామంలో గురువారం మండల వ్యవసాయ శాఖ అధికారి రాజేశ్ రైతులు సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. రైతులు వ్యవసాయ పనులు చేస్తుండటంతో వారి వద్దకువెళ్లి పంటల సాగు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పత్తి పంట సాగుపై రైతులకు పలు సూచనలు చేశారు. పంటల సాగు, ఎరువుల వాడకంపై రైతులు అడిగిన ప్రశ్నలను నివృతి చేశారు. కార్యక్రమంలో ఏఈఓ రాజు పాల్గొన్నారు.

కృష్ణానంద ఆశ్రమ వార్షికోత్సవం



వార్షికోత్సవంలో పాల్గొన్న భక్తులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని మహ్మదాబాద్‌లో ఏర్పాటుచేసిన కృష్ణానంద ఆశ్రమ రెండవ వార్షికోత్సవాన్ని గురువారం రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయ 8వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, మాజీ ఎంపీపీ రమణారావు, జగదీశ్వర్, ఆర్‌ఐ కిషన్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

సహకారంలో ‘రంగంపేట’ ఆదర్శం

- అట్టడుగు స్థాయి నుంచి బి కేటగిరికి
- సభ్యుల సహకారం కొండంత బలం



రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం

కొల్చారం(నర్సాపూర్): స్వాతంత్ర్యం తొలినాళ్లలో ఏర్పాటైన మండలంలోని రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మొదట్లో ఓ వెలుగు వెలిగి అట్టడుగు స్థాయిలోకి వెళ్లింది. గడిచిన పదేళ్లలో పాలకవర్గాలు తీసుకున్న ప్రత్యేక చొరవతో ప్రస్తుతం సంఘం బీ కేటగిరిలో కొనసాగుతూ సభ్యులకు కొండంత అండగా ఉంటోంది. ప్రత్యేక స్థానాన్ని సాధించే దిశగా ముందుకు సాగుతోంది.

సభ్యులకు అందిస్తున్న సేవలు

జిల్లాలో ఐదెకరాల విస్తీర్ణం కలిగి ఉన్న ఏకైక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రంగంపేట. అటు ఎనగండ్ల గ్రామంలోనూ సొంత ఆస్తిని కల్గి ఉంది. సంఘం పరిధిలో 7 గ్రామాలకు చెందిన రైతులతో సభ్యత్వాలున్నాయి. ప్రస్తుతం రైతులకు రుణ సదుపాయాలతోపాటు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందించడం, పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం ద్వారా మద్దతు ధరకు కొంటూ ముందుకు సాగుతోంది. 2023-24 రెండు పంటల కాలంలో 2723 మంది రైతుల నుంచి లక్షా61వేల 11 క్వింటాల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.35,47,08,554 చెల్లించారు. 2024-25 వానాకాలం, యాసంగి సీజన్‌లో 2,777 మంది రైతుల నుంచి లక్షా52 వేల 677 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసి రూ.36,79,69,832 చెల్లింపులు చేశారు. రుణాల విషయానికొస్తే 2024- 25 ఆర్థిక సంవత్సరంలో ఎల్టీ, క్రాఫ్‌లోన్ కింద 526 మంది సభ్యులకు రూ.8,16,74,809 అందజేశారు. ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటివరకు నలుగురికి రూ.3,54,800 రుణాలిచ్చారు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ ద్వారా రెండు లక్షల లోపుల 171 మంది రైతులు లబ్ధి పొందారు.

ఆదాయ మార్గాలు

సంఘం ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తోంది. ఎరువులు అమ్మకాల ద్వారా వచ్చే కమిషన్లు, దుకాణ సముదాయాల ద్వారా అదనపు ఆదాయం సమకూరుతోంది.

ప్రథమ స్థానంలో నిలుపడమే లక్ష్యం



ప్రస్తుతం సహకార సంఘానికి సభ్యులే కొండంత బలం. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడం లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. సభ్యులకు మరిన్ని సేవలు అందించడం ద్వారా సంఘాన్ని ఏ గ్రేడ్‌లో నిలపడమే ధ్యేయంగా పాలకమండలి ముందుకు సాగుతుంది.

-రమేష్ కుమార్, పీఏసీఎస్ చైర్మన్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్

రుణ పరిమితి పెంచాలి



ధాన్యం కొనుగోలు సమయంలో సంఘం ప్రధాన కేంద్రం రంగంపేటలోనే కాకుండా అన్ని గ్రామాల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. రైతు కల్లాల వద్దే కొనుగోలు చేయడం సంతోషం. ప్రస్తుతం ఉన్న రుణ పరిమితిని మరింత పెంచాలి.

- రాజు, రైతు

యాక్షన్ ప్లాన్‌పై జోరుగా ప్రచారం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలో వందరోజుల యాక్షన్ ప్లాన్‌పై అధికారులు విస్తృతంగా ప్రచారం కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం పట్టణంలోని 24వ వార్డులో మున్సిపల్ సిబ్బంది ఇంటింటికి తిరిగి తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే హానికరమైన చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనానికి అందజేయాలన్నారు. చెత్తను ఎట్టి పరిస్థితుల్లో ఇంటికి చుట్టుపక్కల వేయకూడదని తెలిపారు. ఎక్కడ పడితే ఎక్కడ చెత్త పారబోయడం వల్ల దోమలు పెరిగి అనారోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. ఈసందర్భంగా నిబంధనలు పాటించని దుకాణాలకు రూ. 20,500 జరిమానా విధించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ వెంకటేష్, వార్డు అధికారులు పాల్గొన్నారు.

మహిళలు విద్యావంతులు కావాలి



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాస్

రామాయంపేట(మెదక్): మహిళలు విద్యావంతులైతే చాలావరకు సమస్యలు పరిష్కారమవుతాయని మండల విద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఐకేపీ మహిళా సంఘాల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామస్థాయి మహిళలను విద్యావంతులను చేసే విషయమై మొబైల్ యాప్ ద్వారా ఆన్‌లైన్ చేస్తున్నామన్నారు. మహిళలు చదువుకొని అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మహిళలు చదువుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పథకాలపై కళాజాత



పాటలు పాడుతున్న కళాకారులు

నిజాంపేట(మెదక్): ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పథకాల విషయమై తెలంగాణ సాంస్కృతిక కళాకారులు గురువారం మండలంలోని జడ్చెరువు తండాలో పాటల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని అవగాహన కల్పించారు. తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. టీం కోఆర్డినేటర్ కృష్ణ, సభ్యులు రామారావు, ఎల్లయ్య, నర్సయ్య, సిద్దులు, శేఖర్, విజయలక్ష్మి, మాధవి పాల్గొన్నారు.

విద్యార్థులకు షీ టీం, భరోసాపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న షీటీమ్ సభ్యులు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం వెల్దుర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శ్రీరాయరావు సరస్వతీ మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం షీ టీమ్స్, భరోసాపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవ్ టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, మహిళల అక్రమ రవాణా, బాల్య వివాహాలు, బాల కార్మికులు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సైబర్ క్రైమ్స్ వంటి వాటిపై షీ టీం సభ్యురాలు గంగమని, భరోసా టీం సభ్యులు సౌమ్య, శ్రీలత, లావణ్యలు వివరించారు. చెడు స్నేహం, సోషల్ మీడియా ప్రభావం వల్ల కొందరు విద్యార్థులు తప్పుదారిన వెళ్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అటువంటి వారు తమ పద్ధతి మార్చుకోకుంటే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఎంఈఓ యాదగిరి హెచ్చరించారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థానానికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డా.శ్రీనివాసులు, హెచ్‌ఎం సాంబయ్య, పాఠశాల, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయండి

చిన్నశంకరంపేట(మెదక్): రాజ్యాంగా పరిరక్షణకు కాంగ్రెస్ చేపట్టిన జైబాపు-జై భీమ్ సంవిధాన సమ్మేళనం జయప్రదం చేయాలని కాంగ్రెస్ నార్సింగి మండల ఇన్‌చార్జి జూకంటి రాజాగౌడ్ కోరారు. గురువారం నార్సింగి మండల కేంద్రంలో కాంగ్రెస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే పాల్గొనే సంవిధాన్ సమ్మేళానికి కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు, మహిళ, యువజన, ఎన్‌ఎస్‌యూఐ విభాగాల అధ్యక్షులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

చేగుంట(తూప్రాన్): హైదరాబాల్ ఎల్‌బీ స్టేడియంలో శుక్రవారం జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల కోఆర్డినేటర్ మల్లారెడ్డి అన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ



అవగాహన కల్పిస్తున్న ఎంపీఓ తిరుపతి

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిలప్‌చెడ్ ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీఓ తిరుపతి మాట్లాడుతూ పీఏఐ అనేది గ్రామ పంచాయతీల పనితీరును అంచనా వేసే సూచిక అన్నారు. గ్రామాల్లోని విద్య, ఆరోగ్యం, పర్యావరణం, నీటి సరఫరా, పారిశుద్ధ్యం, పేదరిక నిర్మూలన, జీవనోపాధి, సామాజిక భద్రత, లింగ సమానత్వం అనే తొమ్మిది అంశాలపై కార్యదర్శులకు అవగాహన కల్పించామన్నారు. గ్రామాలలో చేసిన ప్రగతి వల్లనే నేషనల్ పంచాయతీ అవార్డ్స్‌కు ఎంపికయ్యే అవకాశాలు ఉంటాయని చెప్పారు. ఎంపీడీఓ ఆనంద్, తహసీల్దార్ సహదేవ్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ అన్వేష్‌రెడ్డి, ఏఎస్‌ఐ రాములు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత, ఏపీఓ శ్యామ్, ఏపీయం ప్రేమలత, హెల్త్ సూపర్‌వైజర్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌పై అవగాహన కల్పించాలి

పెద్దశంకరంపేట(మెదక్): ఫర్టిలైజర్ డీలర్లు రైతులకు ఆయిల్‌పామ్‌పై అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి ఏఓ కృష్ణ సూచించారు. గురువారం స్థానిక రైతువేదికలో ఫర్టిలైజర్ డీలర్లకు యూరియా, డీఏపీ ఎరువుల అమ్మకాన్ని, విత్తనాల స్టాక్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు విత్తనాలు, ఎరువుల కొనుగోలు సమయంలో రశీదులు ఇవ్వాలని సూచించారు. ఏఈఓల వినీత్, అఖిల్, డీలర్లు పాల్గొన్నారు.

దుర్వాసనతో ఇబ్బందులు



దెబ్బతిన్న మ్యాన్‌హోల్



పిల్లికొటాల్‌లోని అంగన్‌వాడీ కేంద్రం

మెదక్‌జోన్: డబుల్ బెడ్రూంలకు సంబంధించిన అండర్ గ్రౌండ్ పైపులైన్ మ్యాన్‌హోల్‌ను జిల్లా కేంద్రంలోని పిల్లికొటాల్‌లో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆనుకొని నిర్మించారు. దాని పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం గతేడాది గాలివానకు మ్యాన్‌హోల్‌పై పడటంతో పగిలిపోయింది. ఫలితంగా అందులో నుంచి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. తల్లిదండ్రులు సైతం పిల్లలను అంగన్‌వాడీకి పంపటం లేదు. పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పగిలిపోయిన మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేసి దుర్వాసన నుంచి చిన్నారులను కాపాడాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నేతలు



రామచందర్‌రావును సన్మానిస్తున్న నాయకులు

పెద్దశంకరంపేట(మెదక్): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన రామచందర్ రావును, నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే విజయ్‌పాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్దశంకరంపేట మండల బీజేపీ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడిని కలిసి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు కోణం విఠల్, అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, బి.కృష్ణ, ఎర్ర శ్రీహరి, భూషణం తదితరులున్నారు.

కూలిన చెట్టు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



తూప్రాన్- నర్సాపూర్ హైవే

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధి చండీ గ్రామ శివారు తూప్రాన్- నర్సాపూర్ రోడ్డుపై చెట్టు కూలి వాహన రాకపోకలు ఇబ్బందులు పడిన విషయం గురువారం సాక్షి దినపత్రికలో ప్రచురితం అయినందుకు సంబంధిత సిబ్బంది స్పందించారు. గురువారం రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్టును తొలగించి వాహనదారుల ఇబ్బందులు తొలగించారు. ప్రయాణికులు, వాహనదారులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

వేతనాలు ఇస్తేనే పనులు



ఎంపీడీఓకు వినతి పత్రం అందిస్తున్న పంచాయతీ కార్మికులు

చిన్నశంకరంపేట(మెదక్): నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వడంలేదని, పస్తులు ఉంటు పనులు చేయబోమని చిన్నశంకరంపేట మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులు ఎంపీడీఓ దామోదర్‌కు వినతి పత్రం అందించారు. గురువారం చిన్నశంకరంపేట ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేతనాలు ఇస్తేనే పనులు చేస్తామని తేల్చిచెప్పారు. పంచాయతీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

వంటమనిషి పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

పెద్దశంకరంపేట(మెదక్): స్థానిక కస్తూర్బా విద్యాలయంలో ఖాళీగా ఉన్న వంటమనిషి పోస్టు కోసం అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజయ ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ పోస్టు కోసం ఎస్సెస్సీ పూర్తి చేసిన మహిళా అభ్యర్థులు ఈ నెల 8లోగా కస్తూర్బా విద్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆ ఫిర్యాదులో నిజం లేదు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేట గ్రామ కార్యదర్శి పద్మపై కొందరు పనిగట్టుకుని ఫిర్యాదు చేశారని, అందులో నిజం లేదని చందంపేట మాజీ ఎంపీటీసీ శివకుమార్, గ్రామస్తులు ఎంపీడీఓ దామోదర్‌కు వినతి పత్రం అందించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయానికి గ్రామస్తులతో కలిసి వచ్చిన ఆయన మాట్లాడారు. గ్రామంలోనే ఉండకుండా, గ్రామసభలకు కూడా హాజరుకాని వారు గ్రామ కార్యదర్శి అందుబాటులో ఉండటం లేదని ఫిర్యాదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. 18 నెలలుగా పంచాయతీ పాలకవర్గం లేకపోయినా గ్రామ సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ కార్యదర్శి పనులు చేస్తున్నారని వివరించారు.

ఆశ్రమ పాఠశాలలో చేరండి

నర్సాపూర్ రూరల్: మండలంలోని మహ్మదాబాద్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో చేరాలని ప్రిన్సిపాల్ రేఖ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చేరేందుకు అవకాశం ఉందన్నారు. పాఠశాలలో చేరే విద్యార్థులకు వసతి గృహంతో పాటు, రెండు జతల యూనిఫామ్స్, పుస్తకాలు, స్పోర్ట్స్ డ్రెస్ ఇతర సౌకర్యాలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు నేరుగా ప్రవేశాలు పొందవచ్చు అన్నారు.

నాచగిరి ఆలయ చైర్మన్‌గా రవీందర్‌గౌడ్



తూప్రాన్: సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం లక్ష్మీనర్సింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా తూప్రాన్ పట్టణానికి చెందిన పల్లెర్ల రవీందర్ గుప్త నియామకం అయ్యారు. ఆయనతో పాటు మరో పది మంది కమిటీ సభ్యులను నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన మెదక్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. చైర్మన్‌గా నియామకం కావడంపై గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకులకు రవీందర్ గుప్త కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ ఎంపీని కలిసిన బీజేపీ నేతలు

మెదక్‌జోన్: ఎంపీ రఘునందరావును మెదక్ బీజేపీ నేతలు గురువారం ఆయన నివాసంలో కలిశారు. ఇటీవలే ఎంపీ కాలికి శస్త్రచికిత్స చేయించుకొని హైదరాబాద్‌లోని తన ఇంటికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న బీజేపీ నేతలు ఆయనను కలిసి పరామర్శించారు. ఎంపీని కలిసిన వారిలో బెండ వీణ, సంగీత, శివ, సంతోష్, శశాంక్ ఉన్నారు.

◆ దరఖాస్తుల ఆహ్వానం

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట మోడల్ పాఠశాల వసతి గృహంలో వంట చేసేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు హాస్టల్ ఇన్‌చార్జి శ్రీవాణి ఒక ప్రకటనలో తెలిపారు. వంటమనిషి కోసం 10వ తరగతి సహాయకురాలి కోసం 7వ తరగతి చదివిన మహిళా అభ్యర్థులు ఈనెల 9లోగా మోడల్ పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం 6300981605 నంబర్‌కు ఫోన్ చేయాలని హాస్టల్ ఇన్‌చార్జి తెలిపారు.

◆ రిటైర్డ్ ఎస్ఈపై చర్యలు తీసుకోండి

మెదక్ కలెక్టరేట్: జూన్ 30న రిటైర్మెంట్ పొందిన విద్యుత్‌శాఖ ఎస్ఈ శంకర్ అక్రమంగా జారీ చేసిన ఉత్తర్వులు బయటపడ్డాయని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం నాయకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌శాఖలో ఎలాంటి బదిలీలు చేపట్టొద్దని గత జూన్ 26న రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేసింది. అయినప్పటికీ వాటిని ఉల్లంఘిస్తూ జూన్ 30న రిటైర్మెంట్ పొందిన ఎస్ఈ శంకర్ అదే రోజు రాత్రి అక్రమంగా బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. అక్రమంగా జారీ చేసిన జీఓలను వెంటనే రద్దు చేసి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అతడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

◆ పైతరలో వైద్య శిబిరం

కొల్చారం(నర్సాపూర్): వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం పైతరలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందజేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు, చుట్టుపక్కల నీరు నిల్వలేకుండా చూసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు.కార్యక్రమంలో ఏఎన్‌ఎం తస్నీవర్, పంచాయతీ కార్యదర్శి మహేష్, ఆశా వర్కర్లు కవిత, నాగరాణి పాల్గొన్నారు.

◆ పీఆర్సీ వెంటనే ప్రకటించాలి

పాపన్నపేట(మెదక్): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వెంటనే పీఆర్సీ ప్రకటించాలని తపస్ మండలశాఖ అధ్యక్షుడు మంగ నర్సింహులు, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో గురువారం సభ్యత్వ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే 53 శాతం పీఆర్సీని ప్రకటించాలని కోరారు. పెండింగ్ డీఏలు, చెల్లించాలని, సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ ప్రవేశపెట్టాలని చెప్పారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని,సీఆర్సీల సమ్మెకాలపు జీతాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రసాద్ రెడ్డి, తులసీరాం, రాజశేఖర్, ప్రవీణ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ దేవేందర్‌రెడ్డి పరామర్శ



పాపన్నపేట(మెదక్): ఇటీవల మృతి చెందిన ఏడుపాయల మాజీ డైరెక్టర్ కిష్టయ్య కుటుంబాన్ని గురువారం బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి దేవేందర్ రెడ్డి పరామర్శించారు. మండల ముఖ్య నాయకులతో పాతలింగాయపల్లి వెళ్లి మృతుడి కుటుంబసభ్యులను కలిశారు. ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కిష్టయ్య మరణం బీఆర్‌ఎస్ పార్టీకి తీరని లోటన్నారు. మండలశాఖ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ వెంకట్ రెడ్డి, ఏడుపాయల మాజీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.